క్లుప్తంగా

నీటి సమస్య లేకుండా చూస్తాం



నల్లాను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

చెన్నూర్‌రూరల్: మండలంలోని వెంకంపేట గ్రామంలోని దుబ్బగూడెం కాలనీలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఖాళీ బిందెలతో బతుకమ్మ ఆడి నిరసన తెలపగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్ సోమవారం గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి మిషన్ భగీరథ పైప్‌లైన్లలో కొన్ని లీకేజీలు ఉన్నట్లు గుర్తించారు. రెండు రోజుల్లో లీకేజీలను రిపేర్లు చేయించి, తాగునీటి సమస్య లేకుండా చూస్తామని తెలిపారు.

ఆంక్షలు ఎత్తివేయాలి

జన్నారం: టైగర్‌జోన్ పేరుతో అటవీశాఖ అధికారులు పెట్టిన ఆంక్షలను ఎత్తివేసి, పశువుల మేతకు అడవిలోకి అనుమతులివ్వాలని జన్నారం అభివృద్ధి కమిటీ కన్వీనర్ శ్రీరామోజు కొండయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారులు పెట్టిన ఆంక్షలు ఎత్తివేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే, రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణ బోర్డు సభ్యులు వెడ్మ బొజ్జు పటేల్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో అటవీ ఆంక్షలు ఎత్తివేయకుంటే మండలంలోని అన్ని గ్రామాల ప్రజలను ఏకం చేసి, ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని పేర్కొన్నారు. సమావేశంలో మండల అభివృద్ధి కమిటీ కోకన్వీనర్లు నర్సింహులు, కొడూరి చంద్రయ్య, భాస్కర్‌గౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో పోరాడుదాం

పాతమంచిర్యాల: అంబేడ్కర్ స్ఫూర్తితో లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాడుదామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్మికులను కట్టు బానిసలుగా చేసే లేబర్‌కోడ్‌ల రద్దు కోసం మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ పైళ్ల ఆశయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, ఉపాధ్యక్షుడు ప్రకాష్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శోభ, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సమ్మక్క, రజక సంఘం జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి భూమిపూజ

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి పెద్దనపల్లిలో సోమవారం నలంద శాఖ గ్రంథాలయానికి భూమిపూజ నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత బీ.ఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్ ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేశారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాదిగ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.అనిల్ కుమార్, మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్, అంజనీకుమార్, బస్తీవాసులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



తిరుపతికి వినతిపత్రం ఇస్తున్న నక్క రాజన్న

భీమారం: జిల్లాలో పనిచేస్తున్న ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిసెంట్లకు వేతనాలు ఇప్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క రాజన్న గిరిజన సంక్షేమశాఖ చైర్మన్ కోట్నాక తిరుపతిని సోమవారం జిల్లా కేంద్రంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో సంఘం గౌరవ అధ్యక్షుడు ఈద లింగయ్య, ఉపాధ్యక్షుడు సుందిళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

లిమ్కా బుక్‌లో మహాప్రస్థానం



ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని కాలేజీరోడ్డులో గోదావరి ఒడ్డున నిర్మించిన మహాప్రస్థానం లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించినట్లు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. మహాప్రస్థానంను సోమవారం ఆయన ప్రారంభించారు. మంగళవారం నుంచి మహాప్రస్థానం అందుబాటులోకి వస్తుందని తెలుపుతూ, సోలార్ విద్యుత్‌తో నిర్వహించేలా ఏర్పాటు చేసిన మహాప్రస్థానానికి దేశవ్యాప్తంగా గుర్తింపు లభిస్తుందన్నారు. లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా అందుకోగా, మహాప్రస్థానంలోని శివుని విగ్రహం వద్ద, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సత్కరించారు.



భీమారం: పూలమాల వేస్తున్న నాయకులు



తాండూర్: శ్రద్ధాంజలి ఘటిస్తున్న అధికారులు, నాయకులు



లక్సెట్టిపేట: ర్యాలీ నిర్వహిస్తున్న మాల సంఘం నాయకులు



సీసీసీ కార్నర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద...



దండేపల్లి: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో...



చెన్నూర్: బీజేపీ ఆధ్వర్యంలో...



వేమనపల్లి: నీల్వాయి చౌరస్తా వద్ద...



నివాళులర్పిస్తున్న క్యాతనపల్లి కమిషనర్ రాజు

అంబేడ్కర్ అందరివాడు

- ఘనంగా భారత రాజ్యాంగ నిర్మాతకు నివాళి
- సింగరేణి ఆధ్వర్యంలో గనులపై వేడుకలు
- పలు చోట్ల ర్యాలీలు
- పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సాక్షి నెట్‌వర్క్: భారత రాజ్యంగ నిర్మాత, బాబా సాహెబ్ అంబేడ్కర్ అందరివాడని, ఏ ఒక్క వర్గానికి చెందిన వారు కాదని పలువురు వక్తలు అన్నారు. ఆయన జయంతిని సోమవారం జిల్లా వ్యాప్తంగా, సింగరేణి ఆధ్వర్యంలో గనులపై ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, అంబేడ్కర్, దళిత సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు అంబేడ్కర్ చిత్రపటాలకు, విగ్రహాలను శుద్ధి చేసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ర్యాలీలు తీశారు. ఆసుపత్రులలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజావేణు, కిరణ్‌కుమార్, తిరుపతి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడూరు సుధీర్‌రావు, కోటపల్లిలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, నస్పూర్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ రావు, చెన్నూర్‌లో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, తగరం వెంకటి, దుర్గం అశోక్, రాజా రమేశ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్ది కార్తీక్, శ్రీరాంపూర్‌లో జీఎం శ్రీనివాస్, ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి షేక్ బాజీ సైదా, అధికారుల సంఘం ఏరియా జాయింట్ సెక్రెటరీ భీమన్న, ఓపెన్ కాస్ట్ గనిలో మేనేజర్ శ్రీనివాస్, రక్షణ అధికారి సంపత్, సంక్షేమ అధికారి శంకర్, యూనియన్ ఫిట్ సెక్రెటరీ మోతే లచ్చన్న, బెల్లంపల్లిలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్, ఆర్డీవో పి.హరికృష్ణ, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, మందమర్రిలో ఇన్‌చార్జి జీఎం, ఎస్వోటు జీఎం విజయప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, కాసిపేటలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గజ్జెల్లి లక్ష్మణ్, హాజీపూర్‌లో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ జిల్లా సభ్యుడు రేగుంట లింగయ్య, గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ వెంకటరాములు, అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్‌రావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బెల్లంపల్లిరూరల్: అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేస్తున్న రేణికుంట్ల ప్రవీణ్



మందమర్రిలో...



ఏసీసీలోని అంబేడ్కర్ కాలనీలో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



జన్నారంలో నివాళులు



బెల్లంపల్లి: నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు



నివాళులర్పిస్తున్న రఘునాథ్ వెరబెల్లి



కాసిపేట: రొట్టెపల్లిలో...



మంచిర్యాల క్రైం: నివాళులర్పిస్తున్న న్యాయవాదులు



భీమిని: వీగాంలో నివాళులర్పిస్తున్న నాయకులు



చెన్నూర్‌రూరల్: చాకెపల్లిలో...



నెన్నెల: నివాళులర్పిస్తున్న నాయకులు



శ్రీరాంపూర్: నివాళులర్పిస్తున్న జీఎం శ్రీనివాస్



గుడిపేట బెటాలియన్‌లో నివాళులర్పిస్తున్న కమాండెంట్ వెంకటరాములు, సిబ్బంది



కోటపల్లి: నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్

విపక్షాలపై ఎమ్మెల్యే వివేక్ ఆగ్రహం

- తప్పుడు ప్రచారం చేస్తే సహించేదిలేదని హెచ్చరిక

చెన్నూర్/రామకృష్ణాపూర్/మందమర్రిరూరల్: అభివృద్ధి పనులపై తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి విపక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని సోమవారం నియోజకవర్గంలోని చెన్నూర్, మందమర్రి, రామకృష్ణాపూర్‌లో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో 15నెలల కాలంలో నియోజకవర్గంలో 180బోరు వేయించినట్లు తెలిపారు. వెంకంపేటలో నీరు రావడంలేదని కొందరు మహిళలు బిందెలతో నిరసన తెలియజేయడం తన దృష్టికి రాగా, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్‌ను పంపించినట్లు తెలిపారు. అధికారుల బృందం వెంకంపేటలో పరిశీలించి నీరు సరఫరా అవుతుందని చెప్పారని, అసత్య ప్రచారాలు చేసిన వారిని గుర్తించి కేసు నమోదు చేయాలని ఎమ్మెల్యే పోలీసులను ఆదేశించారు. పది సంవత్సరాలు జరగని అభివృద్ధి పనులు కాంగ్రెస్ హయాంలో జరుగుతున్నాయని, రానున్న రోజుల్లో మరిన్ని నిధులు మంజూరు చేయించి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తానని చెప్పారు. విపక్షాల ప్రచారాలను తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో చెన్నూర్‌లో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, అంబేడ్కర్ సంఘం పట్టణ అధ్యక్షుడు తగరం చిరంజీవి, మండల అధ్యక్షుడు తగరం వెంకటి, క్యాతనపల్లిలో మున్సిపల్ కమిషనర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



చెన్నూర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

కేంద్రీయ విద్యాలయంలో తరగతులు ప్రారంభం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేటలో 300, 345సర్వే నంబర్లలోని దాదాపు 10ఎకరాల్లో కేంద్రీయ విద్యాలయ నూతన భవనాన్ని నిర్మించారు. 2023 మే 1న భూమిపూజ జరగ్గా సోమవారం కేవీ చైర్మన్, కలెక్టర్ కుమార్‌దీపక్ ఆదేశాల మేరకు సరస్వతీ పూజ నిర్వహించి నూతన తరగతులు ప్రారంభించారు. ప్రభుత్వ అనుబంధ నిర్మాణ సంస్థ జాతీయ ప్రాజెక్టుల నిర్మాణాల సంస్థ(నేషనల్ ప్రాజెక్ట్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ లిమిటెడ్) భవన నిర్మాణ బాధ్యతలు చేపట్టగా, దాదాపు రూ.26కోట్లపై చిలుకు నిధులతో నిర్మాణం పూర్తి చేసింది. ప్రస్తుతం నూతన కేవీ భవనంలో అధునాతన తరగతి గదులు, నూతన ఫర్నిచర్, నూతన కంప్యూటర్, బోధనా పరికరాలు సమకూర్చనుండగా అధునాతన ల్యాబ్స్ ఏర్పాటు చేశారు. కళలకు వేదికతో పాటు క్రీడా మైదానం సౌకర్యం అందుబాటులో ఉంచారు. త్వరలోనే ప్రధానమంత్రి కార్యాలయం నుంచి అధికారికంగా ప్రారంభోత్సవం ఉంటుందని కేవీ ప్రిన్సిపల్ జె.ప్రసాద్ తెలిపారు.



సరస్వతి పూజలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయ సిబ్బంది

‘ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం’

బెల్లంపల్లిరూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సోమవారం మండలంలోని తాళ్లగురిజాల గ్రామంలో ఏర్పాటు చేసిన సన్నబియ్యం లబ్ధిదారుల ఇంట్లో భోజన కార్యక్రమానికి హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. లబ్ధిదారులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంచందర్, స్వామి, రమేష్‌బాబు, సత్యనారాయణ, మహేందర్, రామన్న, ప్రభాకర్, లింగయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించిన భూ భారతి పోర్టల్‌ను సోమవారం బెల్లంపల్లి మండలం కన్నాల రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్యే వీక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కల్పన, బెల్లంపల్లి ఏడీఏ రాజానరేందర్, ఏవో ప్రేమ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ స్వామి, వైస్ చైర్మన్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మహిళలతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే వినోద్

పరామర్శ

నెన్నెల: మండల కేంద్రానికి చెందిన విలేకరి రేణికుంట్ల వెంకటేశ్వర్లు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సోమవారం నెన్నెలలోని ఆయన నివాసానికి వెళ్లి వెంకటేశ్వర్లు చిత్రపటానికి పుష్పాలు సమర్పించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

రెమ్యునరేషన్ పెంచాలి



నిరసన వ్యక్తం చేస్తున్న డీటీఎఫ్ బాధ్యులు

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలో స్పాట్ వాల్యూయేషన్ కేంద్రం వద్ద డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం స్పాట్ వాల్యూయేషన్ రెమ్యునరేషన్ పెంచాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా ఎస్ఎస్సీ స్పాట్ వాల్యూయేషన్ సిబ్బందికి రెమ్యునరేషన్ పెంచడం లేదని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సవరించి రెమ్యునరేషన్ ఇవ్వాలని డీసీఈబీ దామోదర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్, జయకృష్ణ, కార్యదర్శులు ప్రకాశ్, అంజాద్‌పాషా, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

కోదండ రామాలయానికి తాళం

కాసిపేట: మండల కేంద్రంలోని కోదండ రామాలయానికి తాళం వేసిన ఘటన చర్చనీయాంశంగా మారింది. తాళం వేయడానికి అంతర్గత సమస్యలు కారణమైనప్పటికీ భక్తులు ఆందోళనకు గురయ్యారు. ఆలయ కమిటీ మాజీ సభ్యుడు, నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించిన గొల్లపల్లి సత్యనారాయణ ఆదివారం సాయంత్రం ఆలయానికి తాళం వేశాడు. అర్చకుడికి రూ.10వేలు వేతనం ఇస్తున్నప్పటికీ ఆలయాన్ని సక్రమంగా తీయకపోవడంతో తాళం వేసినట్లు తెలిపారు. కాగా అర్చకుడు కమలాకర్ సత్యనారాయణకు సోదరుడు కావడం గమనార్హం. తాను సక్రమంగానే తీస్తున్నానని, గిట్టని వారు చెప్పి ఇలా చేయించారని కమలాకర్ తెలిపారు. త్వరలో కమిటీ సమావేశమై నిర్ణయం తీసుకుంటామని సోమవారం ఆలయానికి వేసిన తాళం తీశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల :
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
చెన్నూర్ : సంపత్‌కుమార్ - 9949708989
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899